బాల బండారం

# ఒక జాగిర్దారు కథ

బండారు రామ్మోహన్ రావు

ఏ సమాజం లోనైనా సరే నేల ఎప్పుడూ రాజ్యానిదే. దానిమీద అధికారం రాజుదే. హైదరాబాదు రాష్ట్రాన్ని పరిపాలించిన నైజాం రాజు తన భూముల్ని నజరానాగా ఇచ్చి రైతులనుండి శిస్తు వసూలు చేసి ప్రభువులకు కట్టడానికి జాగిర్దారు వ్యవస్థ ఏర్పరచాడు. పంట పండించుకోవడానికి ప్రజలకా భూముల్ని లీజుకిచ్చి వాటిమీద పన్నులు వసూలు చేసివ్వడానికి నైజాం రాజు రకరకాల పేర్లతో భూస్వామ్య వ్యవస్థను ఏర్పరచాడు.

అట్లా ఒక ఊళ్ళో ఒక జాగిర్దారు ఉండేవాడు. ఊళ్ళో భూమిలో సగంకంటే ఎక్కువ అతని అధీనంలో ఉండేది. ఆయన హైదరాబాదులో ఉండేవాడు. ఆరేడు నెలలకోసారి గ్రామానికి వెళ్ళి వచ్చేవాడు. భూముల్ని అజమాయిషీ చేసి పన్నులు వసూలు చేయడానికి తనకింద ఒక గుమాస్తాని పెట్టుకొన్నాడు. ఆ గుమాస్తాకి నెలకి వెయ్యి రూపాయిలు జీతం ఇచ్చేవాడు. గుమాస్తా జీతం తీసుకుంటూనే మెల్లమెల్లగా ఆస్తులు సంపాదించుకోవడం మొదలెట్టాడు. రైతులనుండి వసూలుచేసే పన్నుల్లో ఎప్పటికప్పుడు కొంత డబ్బు నొక్కేసి కొత్త ఆస్తుల్ని సంపాదించాడు. ఈ విషయం మెల్లగా ఆనోటా ఈనోటా జాగిర్దారుని చేరింది. గుమాస్తా రైతులనుంచి వసూలు చేసిన పన్నుల డబ్బు కాజేస్తున్నాడని ప్రజలు కూడా జాగిర్దారుకు పిర్యాదు చేసారు. జాగిర్దారుకు కోపం ఎక్కువ. కోపం వస్తే కొరికి చంపుతాడు, ప్రేమ వస్తే కౌగిలించుకొంటాడని ప్రజలు అనుకొనేవారు. గుమాస్తా గురించి వినగానే జాగిర్దారుకు కోపం వచ్చింది. వెంటనే గుమాస్తాను పిలిపించి చెడామడా తిట్టేసి ఉద్యోగంనుంచి తీసేస్తున్నానన్నాడు. అప్పుడా గుమాస్తా జాగిర్దారు కాళ్లావేళ్లాపడి పాతతప్పులు ఇక చేయననీ, బుద్ధిగా ఉంటాననీ బ్రతిమాలుకొన్నాడు. జాలితో కరిగిపోయిన జాగిర్దారు గుమాస్తాని ఈసారికి వదిలేస్తున్నాననీ బుద్ధిగా పని చేసుకోమనీ హెచ్చరించి వదిలేసాడు. కానీ గుమాస్తా బుద్ధి మారలేదు. మళ్ళీ అటు జాగిర్దారును ఇటు ప్రజలను మోసగిస్తూ తన ఆస్తుల్ని అంతకంతకూ పెంచుకోసాగాడు. ఇది తెలిసిన జాగిర్దారు గుమాస్తాని మళ్లీ ఉద్యోగంనుంచి తీసేసాడు. అప్పుడా గుమాస్తా తన భార్యాపిల్లల్ని తీసుకెళ్ళి జాగిర్దారు కాళ్ళమీద పడేసాడు. తన కుటుంబానికి అన్యాయం చేయొద్దనీ, తనను బజారున పడేయవద్దనీ వేడుకొన్నాడు. జాగిర్దారు గుమాస్తాని మళ్లీ క్షమించి ఈసారి వెయ్యి రూపాయల జీతంలో సగం కోత విధించి ఐదు వందలకు ఖరారు చేసాడు. ఐనా గుమాస్తా చేసిన తప్పులే మళ్లీ మళ్లీ చేయసాగాడు. మెల్లమెల్లగా జాగిర్దారు ఆస్తులు కరిగిపోయి, గుమాస్తా ఆస్తులు పెరిగిపోయాయి. చివరికి గుమాస్తా ఆస్తిలో జాగిర్దారును మించిపోయాడు. హైదరాబాదునుంచి జాగిర్దారు తన భూముల్ని చూడడానికి కారులో వచ్చేవాడు. ఆస్తులు కరిగిపోతుంటే బస్సులో రావడం మొదలైంది. ఖరీదైన సూటు బూటు వేసుకొనే జాగిర్దారు క్రమక్రమంగా పేదవాడైపోతూ చిరిగిన సూటు వేసుకొని గుమాస్తా దగ్గరకు వచ్చేవాడు.

ఎలాగైనా గుమాస్తా పీడ వదిలించుకొందామని జాగిర్దారు ఒకసారి ఆ గ్రామానికి వచ్చాడు. అప్పుడా గుమాస్తా జాగిర్దారుకి పళ్ళూఫలాలు, ఒక కొత్త సూటు, బూటు సమర్పించుకొని ఇలా అన్నాడు, "అయ్యా, తమరు నాకు జీతం ఇచ్చే స్థితిలో కూడా లేరని అర్థమయింది. అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. మా తాతగారు

మీ తాతగారి దగ్గరా, మా నాన్నగారు మీ నాన్నగారి దగ్గరా, నేను మీ దగ్గరా మూడు తరాలుగా సేవకులుగా పని చేస్తున్నాం. మీరు జీతం ఇవ్వకున్నా మీ దగ్గర పని చేస్తాను" అని సెంటిమెంటు పండించాడు. జాగిర్దారు గుమాస్తా త్యాగానికి ఆనందపడిపోయి కళ్ళనీళ్ళు పెట్టుకొని, "నీలాంటి సేవకుడు దొరకడం నా అదృష్టం" అన్నాడు. జీతం లేకుండా పనిచేసే సేవకుడు దొరికాడని సంతోషపడ్డాడు. మరో ఐదేళ్లకు కానీ గుమాస్తా నక్క జిత్తులు జాగిర్దారుకు పూర్తిగా అర్థంకాలేదు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.ఆ గుమాస్తా పక్క టౌన్‌లో వంద ఎకరాల భూమి, నాలుగైదు ఇళ్ళతో పాటు ఒక సినిమా థియేటరు, ఒక పెట్రోలు బంకు వగైరా ఆస్తులు కూడబెట్టుకోవడమే కాక ఆ అసెంబ్లీ నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయాడు. జాగిర్దారు పని తారుమారు అయింది. హైదరాబాదులో ఉన్న ఇల్లు, దివాణం అన్నీ అమ్మేసుకొని ఊళ్ళో ఉన్న భూమినే ఆధారం చేసుకొని బతకడానికి గ్రామానికి వచ్చాడు. కానీ అక్కడ భూమి ఉంటేగా! గుమాస్తా జాగిర్దారు భూములన్నీ ఎప్పుడో అమ్మేశాడు. జాగిర్దారు విలాసాలకోసం, విందుల కోసం, డబ్బు ఖర్చుపెట్టిన ప్రతిసారీ ఈ గుమాస్తా ఎన్నో సంతకాలు చేయించుకొనేవాడు. ఆ సంతకాలతోనే భూములన్నీ అమ్మేశాడు. చివరకు జాగిర్దారుకు మిగిలింది ఆ గ్రామంలో పాడుబడ్డ ఇల్లు మాత్రమే. ఆ ఇంటినైనా బాగు చేయించుకొని ఉందామంటే– ఆ ఇంటిని కూడా తనఖాపెట్టి గుమాస్తా బ్యాంకులో అప్పు తీసుకొన్నట్టు తెలిసి బావురుమన్నాడు. ఇక గుమాస్తాను పిలచి అడిగే ధైర్యం కూడా లేదు. ఎందుకంటే ఇప్పుడాయన మామూలు గుమస్తా కాదు. నియోజకవర్గ ఎంఎల్ఏ కూడా మరి! ఇప్పుడు జాగిర్దారు ఎంఎల్ఏగా మారిన గుమాస్తా ముందు చేతులు కట్టుకొని నిలబడవలసి వచ్చింది. తనకింత నిలువనీడ ఇవ్వాల్సిందిగా గుమాస్తాని కోరాడాయన.

"మీ ఉప్పు తిని బతికాను. మీరిలా దీనంగా నన్ను అభ్యర్థించాల్సిన పని లేదు. మీకు తగిన న్యాయం చేస్తాను. మీ దగ్గర ఎన్నో ఏళ్లు జీతం తీసుకున్నందుకు ప్రతిఫలంగా ఇకనుండి నేనే మీకు నెలకు వెయ్యి రూపాయిలు పంపిస్తాను" అన్నాడు గుమాస్తా.

ఈ జాగిర్దారు కథ వింటే మన ప్రజాస్వామ్యంలో ప్రజలు, రాజకీయ నాయకులు– గుర్తొస్తున్నారు కదూ!

ప్రజాస్వామ్యంలో పన్నులు కట్టే మనం జాగిర్దారులం. ప్రభుత్వానికి లభించే ఆదాయం మనం కట్టే పన్నులనుంచే వస్తోంది. ప్రభుత్వానికీ, ప్రజలకీ మధ్య వారధిగా ఉంటున్న గుమాస్తాలు (రాజకీయ నాయకులు) మాత్రం ఈ పన్నుల డబ్బు నొక్కేసి ప్రజల్ని మించిన ధనవంతులు ఔతున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు అయి అక్రమంగా దోచిన ధనాన్ని స్విస్ బేంకుల్లో దాస్తున్నారు. మనకు సేవ చేస్తామని వాగ్దానం చేసి మన ఓట్లతో పదవులు పొందుతున్నారు. మనం కట్టే పన్ను డబ్బులతో ప్రభుత్వాలు నడుపుతున్నారు. సేవకులం అంటూనే– మనకు రేషన్ కార్డ్, పెన్షన్, సబ్సిడీలు ఇతరత్రా సౌకర్యాల పేరు మీద మనకు బిచ్చం వేస్తున్నారు. ఎన్నికల్లో ఓటుకి అయిదు వందలో, వెయ్యి రూపాయిలో పంచుతున్నారు. జాగిర్దారుకి ఎదురు జీతం ఇచ్చే గుమాస్తా లాగ– మన డబ్బే దోచుకొని మనకే తాయిలాలు ఇస్తున్నారు. భూమి పోతే పోయింది, ఎదురు జీతం వస్తుందన్న జాగిర్దారులా మనం అల్పసంతోషం పడుతున్నాం. ఇది సాగినంత కాలం మనను దోచే గుమాస్తాలు పెరుగుతూనే ఉంటారు. వాళ్ళ అక్రమ ఆస్తులు కూడా ఇంతింతయి వటుడు ఇంతయినట్టు విశ్వవ్యాప్త మవుతాయి. మనం మాత్రం ఆ జాగిర్దారు లాగా ఉన్నది పోగొట్టుకొని ఇంకా పేదరికం లోకి జారిపోతాం. దీన్ని ఎదిరించాలి. మన ఓటు అనే ఆయుధంతో రాజకీయ గుమాస్తాలను ఓడించాలి. మన పన్నులడబ్బుల రక్షణగా మనమే నిలబడాలి.

---()---